


గౌరి ఆనాడు, అట్లతద్దినాడు, చింతచెట్టుకు కట్టిన నిలువెత్తు ఉయ్యాల వదిలిపెట్టి రాదు. వానయ్యేది, వరదయ్యేది ఆ ఉయ్యాలేమో, ఆ పక్కనున్న చిన్న గుడిసేమో... తల్లి వేళకింత ముద్దపెడితే తింటుందో తినదో! తనలో తనే నవ్వుకుంటుంది. భూమి బద్దలయినట్లు భళ్లు భళ్ళున ఏడుస్తుంది. గ్రుడ్ల నీరు గ్రుడ్ల కుక్కుకుని నిలువెత్తు ఉయ్యాలమీదనుంచి ఆకాశంలోని చుక్కలవైపు చూస్తుంది. ఆచూపు రంగడికోసం. ఎవరైనా ఓదార్చినా,బుజ్జగించినా లోపలిబాధ చెప్పుకోవడానికి మాటలు రావాయె. గౌరి కన్నీళ్ళు!! కలువపూల కళ్ళు దుఃఖసముద్రాలై పొంగుతుంటే ఊరివాళ్ళ గుండెలు చెరువులాయె! పసుపు ముద్దలాటి గౌరి పుట్టు మూగ. కన్నెవయసు దాటకముందే బతుకంతా మూగబోయింది.

ఐదేళ్ళనాడు --

అట్లతద్దినాడు తెల్లవారుఝామున అందరికంటే ముందులేచింది గౌరి. మాటలొచ్చిన తోటి కన్నెపిల్లలు గలగల మాట్లాడుతూంటే 'మాటలేల.' అన్నట్టు

ఎప్పుడూ గలగల నవ్వేది. ఆ నవ్వులతోటే తోటి పిల్లలందర్నీ లేపింది.

ఒకరా ఇద్దరా? వీధివీధంతా తెలివెన్నెలలో కన్నెపిల్లల నవ్వులు. తలంటు స్నానాలు చేసిన జడలనిండా చేమంతి పూలదండలు, తిలకాలు దిద్దుకున్న ముఖాల్లో చిరుగంటల నవ్వులు. తెల్లవారకుండానే అందరూ భోజనాలకు కూర్చున్నారు. పులిహోర, గోంగూరపచ్చడి, పెరుగన్నం ఆకలైనంత మటుకూ తిన్నారు. గోదావరి ప్రాంతంనుంచి వచ్చిన సుబ్బలక్ష్మి తెచ్చిన ఉల్లిపాయ పులుసు పదిమందీ పంచుకున్నారు. అసలు అన్నం మీద ధ్యాసెవరికి? పెద్దవాళ్ళ పోరుపడలేక చద్ది తినడమేగాని, ఉత్సాహమంతా ఉయ్యాలమీదే. తినీ తినంగానే చేతులుకడుక్కుని కంచాలు అక్కడే వదిలేసి చెంగున వీధిలోకి గెంతారు. పట్టు పరికిణీలు రెపరెపలాడుతూంటే జరీ ఓణీలు గాలిలో ఎగురుతూంటే 'అట్లతద్దోయ్, ఆవట్లోయ్' అంటూ చెమ్మచెక్కలు మ్రోగుతూంటే, సూరీడు ఈ సంబరం చూడ్డానికేమో అన్నట్టు రోజుకంటే ముందు భూమ్మీద వాలాడు.

ముసలి మొగుడు రాకుండా వుండటం తరువాతమాటగాని పడుచుదనం కలకాలం నిలిచిపోయేటట్టు గాలంతా కన్నెవయసు వాసన. సంతోషంతో కృష్ణమ్మ కుప్పిగంతులు. అల్లప్పుడు తెల్లవారగా ఊళ్ళోని కన్నెపిల్లలంతా తోపులోకి తరలివచ్చారు. అంతెత్తు చింతకొమ్మలకి నిలువెత్తు మోకులతో ఉయ్యాల వేయించారు. ముందుగా గౌరే ఉయ్యాలెక్కింది. గౌరికి ఉయ్యాలలూగడం గొప్పసరదా. రయ్‌న ఉయ్యాల ఆశాశంలోకి ఎగురుతూంటే చుక్కల్ని పిలుస్తోంది. గౌరి. ఇంకావేగంగా ఊపమని స్నేహితురాళ్ళని హెచ్చరిస్తోంది. చంద్రవంకలా ఉయ్యాలవూపు. మావి కొమ్మలా ఉయ్యాలవంపు. గంగతల్లిలా గౌరి నవ్వు. గాలిలో తేలుతోంది గౌరి. మబ్బుల్ని ముట్టుకుంటోంది గౌరి కొమ్మలపైకి, చెట్లపైకి చేరుకుంటోంది. చెట్లు, నేస్తాలు, నేల అందరూ కళ్ళు పైకెత్తి గౌరినే చూస్తున్నారు. వున్నట్టుండి గౌరికి కళ్ళు బైర్లు కమ్మాయి. చేయి పట్టు వీడింది. అంతెత్తు ఉయ్యాల మీదనుంచి గౌరి దొర్లింది. జనం హాహాకారాలు చేశారు. ఎక్కడున్నాడో రంగడు బాణంలా దూసుకొచ్చి బంతిలా గౌరిని పట్టుకున్నాడు. గౌరికళ్ళు తెరిచిచూస్తే రంగడి ఒళ్ళో ఉంది. రంగడు

లేకపోతే గౌరి మనకు దక్కేది కాదనుకున్నారందరూ.

కళ్ళు తెరిచిన గౌరి రంగడు కళ్ళలోకి చూసింది. ఎందుకో సిగ్గయి వొళ్ళు పులకలెత్తింది. కళ్ళు వాలిపోగా, ఎవరో చేయి అందించినా పవిట సర్దుకుని తనే రంగడి వొళ్ళోంచి గెంతింది.

ఆ తరువాత నెల తిరగకుండానే రంగడే కబురంపాడు గౌరిని పెళ్ళాడతానని. "అది మూగపిల్లరా" అని ఎవరో అంటే "మూగదైతేనేం ముద్దబంతిపువ్వుకదా' ' అన్నాడు."నువ్వేమంటావో అని అన్నాంగాని అది బంతిపూవేమి దేవపారిజాతం గదా'' అన్నారందరూ. ముహూర్తానికి వూరంతా తమ యింట పెళ్ళి అనుకునివచ్చి మనసారా దీవించారు. మరునటేడు అట్లతద్దికి గౌరి ముత్తయిదువై ఉయ్యాల దగ్గరకు పరుగెత్తుకొచ్చింది. రంగడే స్వయంగా తోపులో ఉయ్యాల కట్టాడు. రంగడే స్వయంగా ఉయ్యాల వూపాడు. కొంతసేపటికి కొమ్మనున్న మోకుపట్టా పక్కకు జరిగితే సరిచేయడానికి చింత చెట్టెక్కాడు రంగడు. ఉయ్యాల సరిచేసి అటూఇటూ చూస్తుండగా కాలు బెసిగి రంగడు కొమ్మమీంచి తలకిందులయ్యాడు. గౌరి కెవ్వనకేక వేసిందేకాని పట్టుకోలేకపోయింది. నెత్తురు ముద్దయిన రంగడ్ని వొళ్ళోకి తీసుకుందే గాని కళ్ళలో కళ్ళు పెట్టి చూడలేకపోయింది. రంగడి కళ్ళప్పటికే మూసుకుపోయాయి.

పసుపు ముద్ద పగిలిపోయింది.

"సామీ" అని పిలవలేని గౌరి, తనగోడు మాటల్లో చెప్పుకోలేని గౌరి ఆనాటినుంచి ఉయ్యాల విడిచి రాలేదు. ఆ మూగబాధకు గుండెలుపగులునో, కొండలు కరుగునో అన్నట్లు కన్నీటిధారలు.

ఉయ్యాల వూగుతూనే వుంది.

"సామీ సామీ" అంటూ "రంగా రంగా" అంటూ అటూ ఇటూ వూగుతోంది. రాత్రనక, పగలనక, వానలో, వరదలో వూగుతూనే వుంది. గౌరి చెక్కిళ్ళ కన్నీరు రాలుతూనేఉంది.*